## 7. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మనకు ఎవరెవరి సహాయం అవసరం ?

### (a) NPEGELలో సమాజ భాగస్వామ్యం

ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమమైనా విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం లేనిదే అది సాధ్యం కాదు. ప్రజలతో మమేకమై చేపట్టే కార్యక్రమాలే అద్భుత సత్ఫలితాలనిస్తాయన్నది అక్షర సత్యం. ప్రభుత్వ కార్యక్రమాలు సమాజ అభ్యున్నతికి, పురోభివృద్ధికి తోడ్పడతాయని ప్రజలు నమ్మిననాడే వారు తమ వంతు సహాయ సహకారాలను పూర్తి స్థాయిలో అందించడానికి ముందుకు వస్తారు.

కాబట్టి బాలికల విద్య పట్ల సమాజాన్ని చైతన్యపరచి వారి భాగస్వామ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు అనుగుణంగానే **NPEGEL** కార్యక్రమాలలో కమిటీలను ఏర్పాటు చేసి వారికి ప్రముఖస్థానం కల్పించడం జరిగింది.

ఈ లక్ష్య సాధనకై ఒక చురుకైన విద్యావంతురాలైన మహిళను క్లస్టర్ కోఆర్డినేటర్‌గా కమిటీ ఎంపిక చేసి కార్యక్రమాలను నిర్వహింపజేయాలి. క్లస్టర్ స్థాయిలో ఏర్పాటు చేయబడిన సర్వసభ్య, కార్యనిర్వహక మండలి సమావేశాలలో క్లస్టర్ కోఆర్డినేటర్ పాల్గొని వారి సలహాలు సూచనల మేరకు ఈ కార్యక్రమం ప్రజల్లోకి వెళ్ళేలా కృషి చేయాలి. క్లస్టర్ కోఆర్డినేటర్ గ్రామస్థాయిలో ఒక కోర్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కోర్ కమిటీలో ఆ గ్రామంలో గల చురుకైన మహిళలను సభ్యులుగా చేసుకొని వంద శాతం బాలికల నమోదు, నిలకడ, బాల్యవివాహాల నిరోధం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల హక్కులు మొ॥లగు అంశాలు చర్చించి తగిన చర్యలను చేపట్టాలి. బాలికల సమస్యల పరిష్కార మార్గాలకై తల్లిదండ్రులతో చర్చించి తగిన చర్యలను చేపట్టాలి. పాఠశాలలో జరిగే ముఖ్యమైన ఉత్సవ కార్యక్రమాలలో, ఊరేగింపులు, అవగాహన సదస్సులలో, అభివృద్ధి కార్యక్రమాలలో సమాజ సభ్యులు చురుకుగా పాల్గొనేటట్లు చేసి, కార్యక్రమాల విజయానికి తోడ్పడాలి.

*"సమ సమానత్వం మన సిద్ధాంతం లింగ వివక్షతను తొలగిస్తేనే ఇది సాధ్యం"*

## (b) వివిధ శాఖలతో సమన్వయం

ఎన్.పి.ఇ.జి.ఇ.ఎల్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి బాలికల సంక్షేమము కొరకు పాటుబడుతున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖలతో సమన్వయం కలిగిఉండటం ఎంతైనా అవసరం.

### 1. మహిళా, శిశు సంక్షేమ శాఖ :

1. అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో జననాల రిజిష్టరు తయారు.
2. బడి బయట బాలికలను తిరిగి బడిలో చేర్చడం.
3. 1వ తరగతిలో విద్యార్థుల నమోదు.
4. కౌమార దశలో ఉన్న బాలికలకు వారి ఆరోగ్య పరిరక్షణ, శారీరక మరియు మానసిక ఒత్తిడిని, ఆందోళనలను అధిగమించడానికి శిక్షణ నివ్వడం.
5. కిశోర బాలిక పథకము ద్వారా వారిని చైతన్యపర్చడం.
6. మన **RBC** లలో మరియు కస్తూర్బాగాంధీ విద్యాలయాలలో బడిబయటి బాలికలను చేర్పించి వారు 10వ తరగతి వరకు చదువు కొనసాగించేలా చేయడం.
7. 'బాలికల అక్రమ రవాణాను' అరికట్టి, వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేయడం.

### 2. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ:

మోడల్ క్లస్టర్ పాఠశాల పరిధిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ల ద్వారా బాలికలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, అవగాహన కల్పించడం. ప్రత్యేకావసరాలు గల విద్యార్థులకు తగు వైద్య సహకారం అందించడం.



**3. న్యాయశాఖ:**

అందుబాటులో ఉన్న న్యాయవాదిని గాని, న్యాయశాఖ నేషనల్ 'లీగల్ సెల్' ద్వారా, ఆడపిల్లల రక్షణకు రాజ్యాంగంలో ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కలుగజేయడం.

**4. గిరిజన, సాంఘిక , వెనుకబడిన సంక్షేమ శాఖలు:**

పైన పేర్కొన్న శాఖల ద్వారా బాలికలకు ఉన్న సౌకర్యాలను ఉపకారవేతనాల వివరాలను తెలియజేయడం, ఆయా శాఖలు నిర్వహిస్తున్న హాస్టళ్ళు, ఆశ్రమ పాఠశాలల్లో బాలికలకు గల అవకాశాలను తెలియపరచడం, వారిని చేర్పించడం, విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ శాఖల ద్వారా దొరికే సహాయ సహకారాలను గూర్చి తెలియజేయడం.

**5. కార్మికశాఖ:**

కార్మికశాఖ అధికారులతో వారి పరిధిలో ప్రమాదకరమైన పనులు చేస్తున్న బాలికలను గుర్తించి, వారి యాజమాన్యాలకు నోటీసులు జారీచేసి బాలికలను విడుదలచేయడం మరియు వారికి పునరావాసం కల్పించడం బాలకార్మిక చట్టాలపై సమాజానికి అవగాహన కల్పించడం, వివిధ యాజమాన్యాలతో సమావేశాలను నిర్వహించి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం.

6. జాతీయ బాలకార్మిక పథకము :

**జాతీయ బాలకార్మిక** పథకము ద్వారా నడుపబడుచున్న బ్రిడ్జికేంద్రాలలో బడిబయట బాలికలను చేర్పించడం, ప్రమాదకర పరిశ్రమలలో పనిచేయుచున్న బాలికలను సర్వేద్వారా గుర్తించి వారిని పాఠశాలలు, బ్రిడ్జి కోర్సులు, హాస్టళ్ళలో చేర్చడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో, పునరావాసంలో వారి సహకారాన్ని పొందడం.

**7. జనశిక్షణ సంస్థాన్:**

జనశిక్షణ సంస్థాన్ వారి సహకారంతో వృత్తి విద్యాసంబంధమైన మరియు జీవన నైపుణ్యాలకు సంబందించిన అంశాలలో బాలికలకు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లకు శిక్షణ ఇప్పించడం.

**8. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ :**

ఈ శాఖ ద్వారా నిర్వహించబడే ఆశ్రమ పాఠశాలల గురించి, మహిళా వృత్తిపరమైన కోర్సుల గురించి మరియు స్వయంసహాయక బృందాల ద్వారా గ్రామీణ స్థాయిలో చేపట్టే వివిధ చైతన్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం.

ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడిన బాలికల, అనాధ బాలికల కుంటుంబాలకు జీవనాధారాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఇప్పించడం.

## 9. వికలాంగుల సంక్షేమ శాఖ :

ఈ శాఖ ద్వారా క్లస్టర్ పరిధిలో ఉన్న వికలాంగ బాలికలను గుర్తించి వారికి చేయూతనిచ్చే పథకాలపై అవగాహన కల్పించడం వారి ద్వారా బాలికలు పూర్తిస్థాయిలో లబ్దిపొందేలా చూడడం. ఈ శాఖ పరంగా వారికి లభ్యమయ్యే బ్రెయిలీ పుస్తకాలు, కంప్యూటర్‌లో శిక్షణ లాంటి కార్యక్రమాలలో మనం గుర్తించిన బాలికలను చేర్పించవచ్చు.

## 10. స్వచ్ఛంధ సంస్థలు :

వివిధ రంగాలలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను వారు బాలికల విద్యకు సంబంధి ంచి ఇదివరలో చేపట్టిన మరియు చేస్తున్న కార్యక్రమాలు వారి అనుభవం మరియు వారి వద్దనున్న నిపుణులు మరియు వసతులను మన **NPEGEL** కార్యక్రమాలలో వినియోగించుకోవడం.

## 11. ఆంధ్రప్రదేశ్ మహిళా సమతా సొసైటీ :

ఆంధ్రప్రదేశ్ మహిళా సమతా సొసైటీ పనిచేస్తున్న జిల్లాలలోని మండలాలలో ఆడపిల్లల చదువు, సాధికారత మొదలగు విషయాలలో వారికి గల అనుభవాన్ని ఈ కార్యక్రమ అమలులో ఉపయోగించుకోవడం.

*"నిన్ను బాగా ఆలోచింపచేసే పుస్తకాలే నీకు బాగా మేలు చేస్తాయి"*